

మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

మంత్రి సీతక్కను కలిసిన మార్కెట్ కమిటీ సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో సభ్యులు రఘుపతిరెడ్డి, నవరాజ్, అంజయ్య, మచ్చేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గణేష్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, జైపాల్‌రెడ్డి, లక్ష్మీ, నర్సింహ పాల్గొన్నారు.



మూసీ ఒడ్డున నివాసాల కూల్చివేతలు, సర్వేలకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, తదితరులు

నివాసాల కూల్చివేతలు, సర్వేలను నిరసిస్తూ మహిళల కొవ్వొత్తుల ర్యాలీ

కొత్తపేట, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): మూసీ ఒడ్డున నివాసాల కూల్చివేతలు, సర్వేలను నిరసిస్తూ శనివారం రాత్రి మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక కట్టా యెల్లేశ్వరీ మాతా పిలుపు మేరకు సుమారు వందకు పైగా కొత్తపేట, చైతన్యపురి డివిజన్ల మహిళలు, పురుషులూ, పిల్లలూ కొత్తపేట సత్యానగర్ వద్ద వెలుగుతున్న కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ కొత్తపేట డివిజన్ ప్రధాన దారుల్లో ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో నిరసన కారులు సీఎంకు, కాంగ్రెస్‌కూ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు.

పేదల జోలికొస్తే హైడ్రాను అడ్డుకుంటాం: సీపీఐ



లెనిన్‌నగర్‌లో పర్యటిస్తున్న సీపీఐ నేతలు

సరూర్‌నగర్: ఆక్రమణల కూల్చివేతల పేరుతో అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్న హైడ్రా అధికారులు పేదల జోలికొస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, సీపీఐ తరఫున వారిని అడ్డుకుని పేదలకు అండగా నిలుస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయా నేతలు మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బస్తీ చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నదని, కూల్చివేతలు తప్పవని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో బస్తీవాసులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. హైడ్రా తన పరిధిని పునఃసమీక్షించుకోవాలని, మొండిగా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివనాయక్, రాజు, శంకరయ్య, యాదమ్మ, చత్రునాయక్, అంజయ్య, నారాయణ, రెడ్యానాయక్, మైసయ్య, దత్తునాయక్, ఎండీ హుస్సేన్, సీత, రేణుక, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



రన్‌ను ప్రారంభిస్తున్న సీఎస్‌బీ డీఎస్పీ సత్తయ్యగౌడ్

ఆరోగ్యకర జీవనశైలితో గుండె పదిలం

సైదాబాద్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె పదిలంగా ఉంటుందని, సంతోషంగా ఎక్కువ కాలంగా జీవించవచ్చని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) డీఎస్పీ సత్తయ్యగౌడ్ అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని చంపాపేటలోని ఓనస్ రోబోటిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్పీ సత్తయ్యగౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. గుండె ఆరోగ్యం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ర్యాలీలో ఆస్పత్రి ఎండీ రమనాయుడు, డాక్టర్ బాలరాజునాయుడు, కార్డియాలజిస్ట్ డాక్టర్ లక్కిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రవి కిరణ్‌తో పాటు సుమారు 300 మంది పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వివేకానందకాలనీలో ఆదివారం కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ రోడ్లు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాల సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్‌ను కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటాచలం, నర్సింహ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ పట్టాలు పొందిన విద్యార్థులతో విష్ణువర్ధన్ తదితరులు

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని జేఎన్‌టీయూ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. నగరశివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో 12వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌తో పాటు ఏకో భారత్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ సారికరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడే వరకు కష్టపడాలని సూచించారు. కళాశాల చైర్మన్ మల్కా కొమురయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి కళాశాలకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఈడీ మల్కా నవీన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎంబీ రాజు, ఎం రాజేందర్‌రెడ్డి, ఏఓ అంబాల శ్రీధర్, ప్రోగ్రాం కన్వీనర్ ప్రియంవద, నవ్య, హెచ్‌వోడీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా మధు



సైదాబాద్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కుర్మగూడ డివిజన్ మాదన్నపేటకు చెందిన జనపాల మధు(లల్లు) నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు.

బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు చేస్తాం

● బడంగ్‌పేట్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల్లో ప్రారంభం కానున్న బతుకమ్మ సంబరాలు, దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల కోసం బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన ఆలయాలు, కూడళ్లు, చెరువుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్టు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె బడంగ్‌పేట్‌లోని పురాతన కాశీబుగ్గ శివాలయాన్ని సందర్శించి అక్కడ చేపట్టనున్న ఏర్పాట్లపై కార్పొరేటర్లు రాళ్లగూడెం సంతోషిశ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డితో కలిసి చర్చించారు. బతుకమ్మలను నిమజ్జనం చేయనున్న ఇక్కడి పుష్కరిణిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుష్కరిణి చుట్టూ చెట్ల పొదలు, ఏపుగా పెరిగిన గడ్డితో పాటు పుష్కరిణిలోని గుర్రపుడెక్క ఆకు, నాచు, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఆలయాలు, చెరువుల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం అక్కడ నిర్వహించిన స్వచ్ఛత సేవ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, నాయకులు గట్టు బాలకృష్ణ, సూర్జగంటి విజయ్, నయనాచారి, కుమార్ పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లోని కాశీబుగ్గ శివాలయంలోని పుష్కరిణిని పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

ఓయూ బతుకమ్మ సంబరాల్లో పారిజాత

సరూర్‌నగర్ : తార్నాకలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో శనివారం రాత్రి ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కార్పొరేటర్ సంతోషిశ్రీనివాస్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పెద్దబావి మౌనికాసుదర్శన్‌రెడ్డితో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసేపు బతుకమ్మ ఆడి సందడి చేశారు.

అవగాహనతోనే ప్రొస్టేట్ కేన్సర్‌పై విజయం : డా. శ్రీనివాస్

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ప్రొస్టేట్ కేన్సర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ దిల్‌సుఖ్‌నగర్ పెసిలిటీ సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ అన్నారు. సెప్టెంబర్ మాసాన్ని ప్రొస్టేట్ కేన్సర్ అవగాహన మాసంగా గుర్తించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆదివారం ఏఐఎన్‌యూ దిల్‌సుఖ్‌నగర్ నుంచి అవగాహన నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఊపిరితిత్తుల కేన్సర్ తర్వాత అత్యంత ఎక్కువగా వచ్చేది ప్రొస్టేట్ కేన్సరేనని, ప్రతి ఏడుగురిలో ఒకరు దీని బారిన పడుతున్నారని వివరించారు. దీనికి ఎలాంటి లక్షణాలు బయటపడవు. చాపకింద నీరులా వ్యాపిస్తుంది. నాలుగోదశకు వచ్చే వరకు ఇది ఉందనేది చాలామందికి తెలియదన్నారు. ఇంత ప్రమాదకరమైన ఈ వ్యాధిపై పురుషుల్లో అవగాహన చాలా తక్కువన్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. 50 ఏళ్ల వయస్సు దాటిన పురుషులందరు ప్రతి సంవత్సరం ఒకసారి ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్, డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్ అనే రెండు సాధారణ పరీక్షలు చేయించుకుంటే ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చని ఆయన తెలిపారు. కుటుంబంలో ఎవరికైన ప్రొస్టేట్ కేన్సర్ వచ్చినా, మూత్రవిసర్జనకు సంబంధించిన సమస్యలుంటే తప్పనిసరిగా యూరాలజిస్టును సంప్రదించి ప్రొస్టేట్ కేన్సర్ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ అవగాహన నడక కార్యక్రమంలో సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, యురాలజిస్ట్ డాక్టర్ దీప్తి, నెఫ్రాలజిస్టు డాక్టర్ వలీ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన నడకలో వైద్యులు, సిబ్బంది ప్రొస్టేట్ కేన్సర్ చికిత్స చేయించుకున్న రోగులు

అబ్దుల్లాపూర్‌మెట్ గౌడ్ సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గౌడ సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా గడ్డం బాలయ్యగౌడ్, సెక్రెటరీగా నారం వెంకటేష్‌గౌడ్, డైరెక్టర్లుగా చెరుకు భాస్కర్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, అంతటి మహేష్‌గౌడ్, బొడిగే రాజుగౌడ్, తొర్పునూరి యాదయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ట్రస్మా కమిటీ సభ్యులు

ట్రస్మా నూతన కమిటీ..

వనస్థలిపురం, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ మండల ట్రస్మా (ప్రైవేట్ పాఠశాలల) నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన గౌరవ అధ్యక్షుడిగా శాంతినికేతన్ పాఠశాలల చైర్మన్ రాధాకృష్ణ, అధ్యక్షుడిగా జి.సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్. ప్రశాంత్‌కుమార్, కోశాధికారిగా రామరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు కృషి చేసిన ట్రస్మా కమిటీ సభ్యులకు నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పిండి నారాయణరెడ్డికాలనీ..



మధుసూదన్‌గుప్తా

చంపాపేట : హస్తినాపురం డివిజన్‌లోని పిండి నారాయణరెడ్డికాలనీ ఫేజ్-1 అధ్యక్షుడిగా మూడవసారి నీలా మధుసూదన్‌గుప్తా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నీలా మధుసూదన్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా మల్లిరెడ్డి కొండల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పి.భూపతిరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.గోవిందరెడ్డి, వి.లక్ష్మారెడ్డి, కోశాధికారిగా కె.లక్ష్మీనర్సింహారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.ప్రభాకర్‌రెడ్డి, డి.సురేందర్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి కాలనీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మధుసూదన్‌గుప్తా అన్నారు.

అధికారుల్లో సమన్వయ లోపంతోనే ప్రమాదాలు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమన్వయ లోపం కారణంగా ప్రజలు ప్రమాదాల బారిన పడాల్సి వస్తోందని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ నేషనల్ హైవే అభివృద్ధిలో భాగంగా హైవేకి అనుకుని ఉన్న ఆగమయ్యకాలనీ రోడ్లు ధ్వంసమై ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మేరకు కాలనీవాసులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం ఆ కాలనీలో పర్యటించి ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ అధికారుల్లో సమన్వయ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, రోడ్లను పునరుద్ధరించకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగకుండా వెంటనే రోడ్లను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, వేణురెడ్డి, కరుణాకర్‌యాదవ్, రామేందర్, గిరిప్రసాద్‌రెడ్డి, వృషికుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

● బీఆర్‌ఎస్ నేత బొక్కా సదానంద్‌రెడ్డి



సదానంద్‌రెడ్డి

చంపాపేట, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): పేదలకు ఎటువంటి కష్టాలు వచ్చిన నేనున్నాను అంటూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నిలుస్తారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, చంపాపేట డివిజన్‌కు చెందిన బొక్కా సదానంద్‌రెడ్డి అన్నారు. కొన్ని రోజులుగా జ్వరంతో ఇబ్బందులకు గురైన ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో కొందరు పనిగట్టుకొని నోటికొచ్చిన మాటలు మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. అనారోగ్యానికి గురికాని వారు ఎవరు ఉండరని, ఇంత మాత్రాన ఎమ్మెల్యేపై లేనిపోని మాటలు గాలికి వదిలివేయడం బాధాకరం అని అన్నారు. పక్కాగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేయడం మన సుధీరన్న లక్ష్యం అని సదానంద్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించడంతో హైడ్రాతో ఇబ్బందులు పడుతున్న పేదలకు కొండంత ధైర్యం వచ్చిందని అన్నారు.

వ్యక్తి అదృశ్యం



మన్సూరాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్లా జిల్లా వేములవాడ మండలం అనుకూరంకు చెందిన హనుమంతరావు (48) డ్రైవింగ్ చేసుకుంటూ నాగోల్ డివిజన్ జైపురికాలనీలో భార్యా పిల్లలతో నివాసముంటున్నాడు. కాగా ఈనెల 19న షేవింగ్ చేయించుకుని వస్తానని తన కారులో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువులను ఆరాతీసినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం అతడి భార్య జయశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చాదర్‌ఘాట్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాలివాహననగర్‌లో జరిగింది. ఎస్‌ఐ సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మౌనీష్‌రెడ్డి(32)కి 2019లో వివాహమైంది. బతుకు దెరువు కోసం మూడేళ్ల క్రితం నగరానికి వచ్చి ప్రస్తుతం శాలివాహననగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. హెచ్‌డీఎఫ్‌సీలో కొంతకాలం పనిచేసిన మౌనీష్‌రెడ్డి రెండేళ్లుగా ఖాళీగా ఉంటున్నాడు. భార్య ప్రైవేటు ఉద్యోగి, ఇటీవల షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడంతో నష్టపోయాడు. ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసును మలక్‌పేట ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.

రామాలయంలో అగ్నిప్రమాదం

ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేటలోని రేస్‌కోర్సు రోడ్డులో ఉన్న శ్రీరామచంద్రస్వామి ఆలయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం గుడిలోంచి పొగలు వస్తుండడంతో స్థానికులు గమనించి గుడి కమిటీ సభ్యులకు, పూజారికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు వచ్చి గుడి తాళాలు తీసి చూడగా అప్పటికే స్వామివారి కల్యాణ మండపం కాలిపోయింది. అందులో ఉన్న సామగ్రి, పక్కనే ఉన్న కుర్చీలు మొత్తం కాలిబూడిదయ్యాయి. దేవాలయం గోడలు, పైకప్పు మంటల దాటికి నల్లగా పొగచూరిపోయాయి. అగ్నిప్రమాదంలో సుమారు రూ.30వేల విలువచేసే వస్తువులు కాలిపోయినట్లు గర్తించారు. అగ్నిప్రమాదానికి కారణాలేంటో తెలువ డం లేదు. దేవాలయ కమిటీ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చాదర్‌ఘాట్ పోలీసులు వచ్చి గుడిలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశాన్ని చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీలను చూడగా మండపం వద్ద చిన్నగా పొగతో మంటలు వ్యాపించినట్లు కెమెరాలో రికార్డయింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అగ్నిప్రమాదం జరిగిన మండపాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

ప్రైవేట్ నర్సింగ్ బస్సు ఢీకొని ఒకరి మృతి



మృతుడు ఉమేష్(ఫైల్)

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): రాంగ్‌సైడ్‌లో రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న యశోద ఆస్పత్రి నర్సింగ్ స్టాఫ్ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. చాదర్‌ఘాట్ ఎస్‌ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ప్రాంతానికి చెందిన బసికొండ ఉమేష్ డబీర్‌పురలోని కోమటివాడిలో ఉంటున్నాడు. పానీ పూరి వ్యాపారం చేసే ఉమేష్ మలక్‌పేట డీమార్ట్ చౌరస్తాలో రాంగ్‌రూట్‌లో రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇంతలో వేగంగా మలక్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తున్న యశోద ఆస్పత్రి నర్సింగ్ స్టాఫ్ బస్సు ఢీకొట్టడంతో ఉమేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ అంబర్‌పేట నివాసి తానయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసును చాదర్‌ఘాట్ ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మణ్, సంజయ్‌కి లడ్డూ అందజేత



సరూర్‌నగర్ : బాలాపూర్ లడ్డూ విజేత కొలన్ శంకర్‌రెడ్డి ఆదివారం కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌లను వారి గృహాలలో కలిసి లడ్డూ ప్రసాదం అందజేశారు.



నర్సయ్యకు సర్జరీ విజయవంతమైందని వెల్లడిస్తున్న కృష్ణమూర్తి, పక్కన సర్జరీ చేసిన డా.రేపాకుల కార్తీక్ తదితరులు

మోకాలి ఇన్ఫెక్షన్‌కు కాంప్లెక్స్ రివిజన్ సర్జరీ

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న 65 ఏళ్ల వృద్ధుడికి మలక్‌పేట కేర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రేపాకుల కార్తీక్ వైద్య బృందం మోకాలి ఇన్‌ఫెక్షన్ కాంప్లెక్స్ రివిజన్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. నర్సయ్య (65) మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత సంవత్సరాల తరబడి నొప్పిని భరిస్తుండగా.. చలనం సైతం తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో డా.కార్తీక్‌ను సంప్రదించగా అతడి మోకాలిలో యాంటీ బయోటిక్ రెసిస్టెంట్ ఇన్‌ఫెక్షన్‌ను గుర్తించారు. దీనికి చికిత్స చాలా కష్టమని, అరుదైన చికిత్స చేయాలని రోగి కుటుంబీకులకు చికిత్స చేసే విధానాన్ని వివరించారు. అనంతరం రెండు దశల శస్త్ర చికిత్స నిర్వహించారు. మోకాలి కీలు చుట్టూ ఎముక నష్టం కారణంగా భవిష్యత్తులో చలనం కోసం వైద్యులు చికిత్స చేశారు. మొదట్లో నర్సయ్య ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడని కేర్ ఆసుపత్రి మలక్‌పేట చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి వెల్లడించారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

శ్రీవారి లడ్డూ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపి అపవిత్రం చేయడం దుర్మార్గమైన చర్య అని, దీనికి బాధ్యులైన దోషులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. లడ్డూ కల్తీకి నిరసనగా వివేకానంద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేట్‌లోని శివాలయం చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నేత కొలన్ శంకర్‌రెడ్డి, బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కార్పొరేటర్ గౌరీశంకర్, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వినోద్, రమణగురుస్వామి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 29వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ మాజీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వామినాయక్, బాలకృష్ణ, సాయిచరణ్‌రెడ్డి, జటావత్ సోనా, రవిశంకర్, హతీరామ్, దేవదాస్, రవీందర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి : సురేందర్‌యాదవ్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశంతో పాటు రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నాగోల్ డివిజన్ సహభావన టౌన్‌షిప్‌లోని సీ-బ్లాక్ వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సురేందర్‌యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలిచే ఏకైక పార్టీ బీజేపీయేనని, ప్రతి ఒక్కరూ బీజేపీలో సభ్యత్వం తీసుకుని పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధిక, గజ్జల శేఖర్, శివకుమార్, సీ-బ్లాక్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.